క్లుప్తంగా

తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని వినతి

మార్కాపురం: పట్టణంలో రాబోయే వేసవిలో ప్రజలు తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కోనున్నారని.. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మార్కాపురం ట్యాక్స్ పేయర్స్ అండ్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి మల్లిక్ కమిషనర్‌కు గురువారం పంపిన వినతి పత్రంలో కోరారు. పట్టణంలో ఉన్న బోర్లు, కుళాయిలు చాలా వరకూ ఉపయోగపడే పరిస్థితి లేదన్నారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీ టాక్స్ చెల్లిస్తున్నారన్నారు. ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీకి సరఫరా చేసే దూపాడు సాగర్ కాలువలో నీటి ప్రవాహం తగ్గిందని, దీనివలన ఎస్ఎస్ ట్యాంకులో నీటి సరఫరా కూడా రోజు రోజుకు తగ్గుతోందన్నారు. సమస్య తీవ్రతరం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మల్లిక్ కోరారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల అహ్వానం

రాచర్ల: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను అహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 చెల్లించి మార్చి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో స్థానిక పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సనాతన ధర్మ ప్రచార పుస్తకం అందజేత


కమిషనర్‌కు పుస్తకం అందజేస్తున్న శివమల్లారెడ్డి

గిద్దలూరు రూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వారి ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులును తన కార్యాలయంలో గురువారం కలిసి సనాతన ధర్మంపై రచించిన పుస్తకాన్ని నిర్వాహకులు అందజేశారు. ఈసందర్భంగా ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ పంట శివమల్లారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అందులోని గొప్పతనాన్ని చదివి పదిమందికి తెలియజేయాలని కోరారు. భారత సంస్కృతి సాంప్రదాయాలను రక్షించుకోవడం దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరి భుజస్కంధాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు సూరె క్రిష్టారావు, ఎం.రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు కోరారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. పశ్చిమ ప్రాంతంలో శాశ్వతంగా కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో శాశ్వతంగా కరువు పోతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాసనాల సరోజినీ, బొంతల కృష్ణ, చిన్నయ్య, మద్దెల లక్ష్మీ తదితరులు ఉన్నారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఒంగోలు సిటీ: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కిశోర్‌బాబు అన్నారు. గురువారం ఒంగోలు మండల పరిధిలోని కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కర్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ- పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు ఈకేవైసీ చేయించుకోవాలని, అప్పుడు మాత్రమే రైతుకు నష్టపరిహారం వచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రైతుకు 11 అంకెల విశిష్ట నంబర్ కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఆదిమూర్తి, రామకృష్ణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు హిమబిందు, హైమావతి, పాల్గొన్నారు.

పదికి.. పక్కాగా సిద్ధం!

- పాఠశాలల్లో ప్రత్యేక స్టడీ అవర్స్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- రాచర్ల మండలంలో పరీక్షలు రాయనున్న 423 విద్యార్థులు


యడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

రాచర్ల: పదో తరగతి విద్యార్థులకు తొలిమెట్టు. తొలి అడుగే సరిగా పడితే భవిష్యత్ అంతా సరిగా ఉంటుందని భావిస్తారు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు. ఈనేపథ్యంలో ఏడాది అంత చదువుకున్న పాఠాలు మళ్లీ నెమరు వేసుకొని పబ్లిక్ పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్నారు విద్యార్థులు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. పదికి పది జీపీఏ లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పాఠాల్లోని సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పూర్తిగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గణితం, సైన్స్, హిందీ సబెక్టుల్లో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా క్లాసులను ఏర్పాటు చేసి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు తమవంతుగా కృషి చేస్తున్నారు. మండలంలోని ఆకవీడు, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు సెంటర్లు ఏర్పాటు చేశారు. రాచర్ల మండలంలో మెత్తం విద్యార్థులు 423 పరీక్షలకు హాజరవనున్నారు.

జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	06
ఎయిడెడ్ స్కూల్	01
మోడల్ స్కూల్	01
గురుకుల పాఠశాల	01
కస్తూరిబా బాలికల పాఠశాల	01
ప్రైవేటు పాఠశాలలు	02

10 జీపీఏ సాధించడమే లక్ష్యం..



పది జీపీఏ సాధించడమే లక్ష్యంగా పాఠశాల అరంభం నుంచి ప్రణాళికతో సిద్ధమవుతున్నా. ఉదయం, రాత్రి సుమారు 5 గంటల సమయాన్ని కేటాయిస్తూ చదువుతున్నా. 10 జీపీఏ సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడమే నా ధ్యేయం. అందుకు తగినట్లుగా ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

– టీ. జీవని, పదో తరగతి, మోడల్ స్కూల్

పది పరీక్షలకు సన్నద్ధమయ్యాం..



పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు పాటిస్తూ వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువస్తాను. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు లేచి ప్రణాళిక ప్రకారం చదువుతున్నాను.

– ఎస్.అనంద్ రాజు, పదో తరగతి, మోడల్ స్కూల్

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి..



పదిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. అందుకు ప్రతి రోజు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ప్రణాళికబద్ధంగా చదివిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

– జీ సుధాకర్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

వేడుకగా శివపార్వతుల కల్యాణం

కొనకనమిట్ల: మహా శివరాత్రి సందర్భంగా రెండో రోజు గురువారం మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రం, సలనూతల రామలింగేశ్వరస్వామి, ఎదురాళ్లపాడు సంగమేశ్వరస్వామి ఆలయాలలో శివ, పార్వతుల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొనకనమిట్లలో రామధూత క్షేత్రంలో ఆలయ వేద పండితులు అకలంకం రామకృష్ణమాచార్యులు, కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, సలనూతలలో కుంకుమ బండ్లతో స్వామివారికి ఉత్సవం నిర్వహించారు. సత్యనారాయణ, ఆంజయ్య పర్యవేక్షణలో ముందుగా పార్వతి, పరమేశ్వరులకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు పాల్గొని శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎదురాళ్లపాడులో ప్రసిద్ధిగాంచిన గంగాపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణపల్లి కాశీవిశ్వేశ్వర ఆలయం, సలనూతల, అంబాపురం శివాలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.


నందివాహనంపై స్వామివారు

వాగుమడుగు, రేగడపల్లి, గనివానిపాడు, అంబాపురం, కొత్తపల్లి, చవటపల్లి, వద్దిమడుగు, కొనకనమిట్ల, చింతగుంట్ల తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

నందివాహనంపై మహాదేవుడు

మార్కాపురం టౌన్: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆది దంపతులు గురువారం నంది వాహనంపై మహేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహా శివరాత్రి ఉత్సవాలు పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు మార్చి 5వ తేదీ వరకూ జరగనున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు వేలూరి ఆంజనేయ శర్మ, రెంటచింతల వరుణ్‌తేజ్ శర్మలు స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. నగరోత్సవంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామివారు గజవాహనంపై సార్వభౌమ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.


ఎదురాళ్లపాడులో కల్యాణంలో పాల్గొన్న ఉభయ దాతలు


కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రథోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు


బొమ్మల ఎద్ల బండిపై ఊరేగుతున్న శివపార్వతులు


వేషధారణతో నృత్యం చేస్తున్న కళాకారులు


అన్నదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు


హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

- అడుగడుగునా అన్న సంతర్పణలు
- ఆకట్టుకున్న వేషధారణలు

పొదిలి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పొదిలి నిర్మమహేశ్వర స్వామి వారి రథోత్సవం నభూతో నభవిష్యతిలాగా సాగింది. గురువారం జరిగిన రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు అడుగడుగునా అన్న సంతర్పణలు, పానీయాలు అందించారు. పట్టణంలోని పలువురు వ్యాపారస్తులు, స్వచ్ఛంద సంస్థలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప సేవా సమితి, ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ అసోసియేషన్ పలు చోట్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. పులిహోర, దద్దోజనం, విజిటేబుల్ పలావు, పెరుగన్నం, మంచినీరు, మజ్జిగ భక్తులకు అందచేశారు. గునుపూడి భాస్కర్ వారి సోదరులు దాల్ మిల్లులో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. రథోత్సవంలో పాల్గొనే భక్తుల కోసం ఆలయంలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి మందులు అందించటంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అధిక సంఖ్యలో నిల్వ ఉంచుకున్నారు.

తప్పిపోయిన చిన్నారి కుటుంబం చెంతకు

రథోత్సవంలో ఓ చిన్నారి తప్పిపోయి ఏడుస్తూ పోలీసులకు కనబడింది. ఇది గమనించిన పోలీసులు సదరు బాలికను స్టేషన్‌కు చేర్చారు. సోషల్ మీడియాలో ప్రచారం కల్పించటంతో వారి బంధువులు వచ్చి బాలికను తీసుకవెళ్లారు. రథోత్సవం ముగిసిన వెంటనే స్వామి వారి హుండీ లెక్కింపు ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యులు సమక్షంలో హుండిని తెరిపించిన ఆలయ అధికారి నారాయణరెడ్డి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

వేషధారణతో కళాకారుల నృత్యం

రథోత్సవం సందర్భంగా పలువురు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేషధారణల్లో పలువురు నృత్యాలు ప్రదర్శించారు. ఎడ్లబండిపై శివ పార్వతుల ఊరేగింపు ఆకట్టుకుంది. భజనలు, కోలాటాలు ప్రదర్శించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఈవోఆర్డీ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సైడు కాలువలు, వీధులు శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య కార్మికులతో పని చేయించాలన్నారు. అలాగే చెత్త సంపద కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తెచ్చి వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. కార్యదర్శులు పంచాయతీలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బాలుడిపై వీధికుక్కల స్వైర విహారం


గాయపడిన బాలుడు

కంభం: వీధికుక్కలు స్వైర విహారం చేసి ఐదేళ్ల బాలుడిని తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన మండలంలోని కందులాపురం పంచాయతీలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పూసలబజారుకు చెందిన దేవరకొండ రామ్‌చరణ్ నడుచుకుంటూ వెళ్తుంటగా వీధిలో ఓ చోట గుంపుగా ఉన్న ఐదు కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేయడంతో చేతులకు, చెవికి, పొట్టకు, తల వెనుక భాగంలో తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. రక్తపు గాయాలతో రోధిస్తున్న బాలుడిని కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. గత కొంతకాలంగా కంభం, కందులాపురం పంచాయతీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ చిన్నపిల్లలపై, వృద్ధులపై, వాహనదారులపై దాడులు చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇంకా ప్రజలు కుక్కల దాడికి గురికాక ముందే ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి అన్నా నివాళి


నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు, నాయకులు

తర్లుపాడు: గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భవనం రామచంద్రారెడ్డి తండ్రి పెద్ద వెంకటరెడ్డికి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు గురువారం నివాళి అర్పించారు. రామచంద్రారెడ్డికి, కుటుంబ సభ్యులకు అన్నా ధైర్యం చెప్పారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మురారి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాయం శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, కాశయ్య, రంగారెడ్డి, నాలి కొండయ్య, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో పథకాలు


రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకటేశ్వర్లు

తర్లుపాడు: మండలంలోని రైతులు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏవో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండలంలోని రాగసముద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు నంబర్ అందరూ నమోదు చేసుకోవాలన్నారు. ఈ నంబర్‌తోనే పథకాలు అందుతాయని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ఆధార్, వన్-బీ, లింకు మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.